సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



కార్మికులకు అండగా ఉంటాం

సింగరేణి కార్మికులకు అండగా ఉంటామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. జిల్లాలోని బొగ్గుగనుల్లో ప్రచారం నిర్వహించారు. 9లో



ఉత్కంఠగా క్రికెట్ టోర్నీ

అశ్వాపురంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీ ఉత్కంఠగా సాగుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. తెల్లవారు జామున, రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కృష్ణయ్య సన్నిధిలో రామయ్యకు రాపత్తు సేవ



శ్రీకృష్ణాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి రాపత్తు సేవలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మిథిలా స్టేడియం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీకృష్ణాలయంలో రామచంద్రమూర్తికి రాపత్తు సేవ నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా శ్రీకృష్ణాలయానికి తీసుకెళ్లారు. అనంతరం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన విశ్రాంత ప్రధానార్చకులు పొడిచేటి జగన్నాధాచార్యులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ

భద్రాచలంటౌన్: భద్రాచలం వేదికగా నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు వాతాడి దుర్గా అశోక్, తోటమళ్ల బాలయోగి వివరాలు వెల్లడించారు. భద్రాచలంలోని జూనియర్ కళాశాల మైదానంలో గత 28ఏళ్లుగా టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు వారాల పాటు జరిగే పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. టోర్నీలో విజేతతో పాటు రన్నరప్‌గా నిలిచే జట్టుకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈసమావేశంలో శ్రీధర్, శ్రీనివాస్, నాగార్జున, సదానందం, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం



పోటీల నిర్వాహకులతో రామ్మోహన్‌రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన గాలి రామ్మోహన్‌రావు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన ఆయన.. ముంబయిలో ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో 105 కిలోల మాస్టర్స్ విభాగంలో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇదే పోటీలలో భద్రాచలానికి చెందిన సరియం భరత్‌కుమార్ 59 కిలోల జూనియర్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులతో పాటు కోచ్ రామిరెడ్డిని పలువురు అభినందించారు.

కౌన్సిలర్లతో ఎమ్మెల్యే చర్చలు ?

● అవిశ్వాసం ఎదుర్కొనేందుకు వ్యూహం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసం ఎదుర్కొనేందుకు కొంతమంది కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కోరం కనకయ్య చర్చలు జరిపారు. సోమవారం పలువురు కౌన్సిలర్లకు ఫోన్ చేయగా, మరికొందరిని నేరుగా కలిసి చర్చించారు. ఇటీవల కాలంలో కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసం కోసం కలెక్టర్‌కు నోటీస్ అందజేసిన విషయం విదితమే. అయితే కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో కౌన్సిలర్లలో కొందరిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. అయితే అందరినీ పార్టీలోకి చేర్చుకునేందుకు సిద్ధంగా లేరని తెలుస్తోంది. అంతేగాక అవిశ్వాసం కోసం ఎవరెవరు దూకుడుగా ముందుకు సాగుతున్నారో వారిపై దృష్టి సారించాలని కూడా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరిని కలిసి చర్చిస్తున్నారు. వారి అభిప్రాయాన్ని కూపీ లాగుతున్నారని, అవిశ్వాసం లేకుండా చేసేందుకు గల అవకాశాలు పరిశీలిస్తున్నారని తెలిసింది. ఒకవేళ అవిశ్వాసం పెడితే ఏం చేయాలనే విషయాన్ని కూడా కొందరు కౌన్సిలర్లతో చర్చిస్తున్నారని సమాచారం. గతంలో వ్యవహరించిన పద్ధతికి స్వస్తి చెప్పి అభివృద్ధికి సహకరించాలని, అవిశ్వాస యోచనను విరమించుకోవాలని కోరుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు ఇంటికి స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి మాట్లాడటం అనుమానాలకు తావిస్తోంది.

సందడి అంతంతే !



కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జీఎల్‌బీకేఎస్ నాయకులు (ఫైల్)

ముగిసిన సింగరేణి గుర్తింపు ఎన్నికల ప్రచారం

- అంతగా కనిపించని రాజకీయ నాయకుల హడావిడి
- ముందు వరుసలో నిలిచిన కార్మిక సంఘాల నేతలు
- చివరి రోజు పొంగులేటి, కూనంనేని విస్తృత పర్యటన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల నిర్వహణపై అప్పుడు బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు అభ్యంతరం వ్యక్తం చేసినా కోర్టు ససేమిరా అనడంతో ఎట్టకేలకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఈనెల 27న జరుగనున్నాయి. ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. గతంలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి రాజకీయ పార్టీల జోక్యం తగ్గినట్టుగానే భావించాలి.

బరిలో 13 కార్మిక సంఘాలు..

సింగరేణిలో మొత్తం 15 వరకు రిజిస్టర్డ్ కార్మిక సంఘాలు ఉన్నాయి. ఇందులో 13 సంఘాలు ప్రస్తుతం ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి. ఇందులో మెజార్టీ కార్మిక సంఘాలు ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ తదితర పార్టీలకు అనుబంధంగానే పని చేస్తున్నాయి. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు 1998 నుంచి జరుగుతున్నాయి. ఆరంభంలో ఈ ఎన్నికల ప్రక్రియలో కార్మిక సంఘాలు, వాటి నేతలే కీలకంగా వ్యవహరించేవారు. కానీ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావం తర్వాత సింగరేణి ఎన్నికలపై అప్పటి ఉద్యమనాయకుడు కేసీఆర్ ఫోకస్ పెట్టారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం కోసం సింగరేణి పరిధిలో విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం సైతం సింగరేణి ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడం ప్రారంభించాయి.

పెరుగుతున్న రాజకీయ జోక్యం..

2008 నుంచి సింగరేణిలో కార్మిక సంఘాల కంటే రాజకీయ పార్టీల పెత్తనం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా సకల జనుల సమ్మె తర్వాత ఒక్కసారిగా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. దాదాపు రెండు నెలల పాటు సమ్మెలో పాల్గొన్న కార్మికులు, కార్మిక సంఘాల నేతలకు ప్రధాన రాజకీయ పార్టీ నేతలతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. మరోవైపు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేయగల సింగరేణిపై రాజకీయ నాయకుల దృష్టి పెరిగింది. కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వ్యూహరచన చేయడం మొదలుపెట్టారు. కార్మికులను ఆకట్టుకునేందుకు తాయిలాలు ఇవ్వడం, క్యాంప్‌లు ఏర్పాటు చేయడం వరకూ పరిస్థితులు మారాయి.

చివరి రోజున ముఖ్య నేతలు..

పోలింగ్‌కు ఐదు రోజుల ముందు వరకు కూడా ఎన్నికలపై సందిగ్ధత నెలకొనడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ వంటి పార్టీలు సింగరేణిపై ఎక్కువగా దృష్టి పెట్టలేదు. అన్ని ప్రధాన పార్టీలు ఈసారి ఎన్నికలను పూర్తిగా కార్మిక సంఘాలకే వదిలేయాలనే నిర్ణయానికి వచ్చాయా అన్నట్టుగా కనిపించింది. గనుల వద్ద జరిగే గేట్ మీటింగ్‌లలోనూ రాజకీయ నేతల సందడి అంతగా లేదు. కార్మిక సంఘాల నేతలే అంతా తామై వ్యవహరించారు. సమస్యలు ఉంటే ఆయా మంత్రులు, ఎమ్మెల్యేలను కలవడం తప్పితే నేరుగా ఖద్దరు చొక్కాలను ప్రచారంలో భాగం కానివ్వలేదు. అయితే ప్రచారం చివరి రోజైన సోమవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయితో కలిసి సుడిగాలి పర్యటన, ప్రచారం నిర్వహించారు. ఇక సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలో ఏఐటీయూసీ తరఫున ప్రచారం చేశారు.

కోర్టు ఆదేశాలతోనే ఎన్నికలు..

వరుసగా పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉండడం, మరోవైపు 12 ఏళ్లు టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండడంతో సహజంగా ఏర్పడే వ్యతిరేకత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని వణికించింది. దీంతో సాంకేతిక కారణాలు చూపుతూ రెండేళ్లుగా సింగరేణి ఎన్నికల వాయిదా కోసం ప్రయత్నాలు చేసింది. చివరకు న్యాయస్థానం జోక్యంతో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. అయినప్పటికీ బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ మధ్యలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్‌కు అధికారం దక్కింది. అయితే అప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో అందుబాటులో ఉన్న తక్కువ సమయంలో ఆశించిన మేరకు ప్రభావం చూపలేమనే ఉద్దేశంతో కాంగ్రెస్ సర్కార్ సైతం ఎన్నికల నిర్వహణ పట్ల విముఖత చూపింది. అయితే కోర్టు ససేమిరా అనడంతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతోంది.

లోక రక్షకా.. వందనం



కొత్తగూడెం సెయింట్ అంద్రూస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, టేకులపల్లి, సుజాతనగర్, బూర్గంపాడు, అశ్వారావుపేట, మణుగూరు తదితర పట్టణాల్లో పలు చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలు, పూలదండలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆయా చర్చిల్లో కేక్ కట్ చేయడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడు ఏసు ప్రభువు జననం, ఆయన చూపించిన మహిమల గురించి మత పెద్దలు వివరించారు. యువతులు, మహిళలు క్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. పలు చోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పలు చర్చిల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్





బూర్గంపాడు చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

'ప్రజాపాలన'కు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించినట్టుగా ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం ఆమె జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారని, నిర్దేశించిన అధికారులు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణపై మంత్రి కోమటిరెడ్డి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఎనిమిది పని దినాల్లో రోజుకు రెండు షిఫ్టుల చొప్పున గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుందని. ఈ మేరకు షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ సెలవు రోజులైన డిసెంబర్ 3, జనవరి 1.. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు. ప్రజాపాలనలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతిరోజు వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంతో పాటు నివేదికలు అందజేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.రాంబాబు, మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత పాల్గొన్నారు.

కూనంనేనిని అడ్డుకున్న సింగరేణి సెక్యూరిటీ

అధికారులతో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే, ఏఐటీయూసీ శ్రేణులు



సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీపీఐ, సీపీఎం అనుబంధ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ప్రచారం చేసేందుకు కార్యాలయం సమీపంలోకి చేరుకోగా, సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో కొత్తగూడెం ఏరియాలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు సింగరేణి ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే రాకను గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. దీంతో ఎమ్మెల్యేను లోనికి రాకుండా డోర్ వేయడం సరికాదని, స్థానిక ఎమ్మెల్యేకు ఇచ్చే మర్యాద ఇదేనా అంటూ సెక్యూరిటీ సిబ్బందితో ఏఐటీయూసీ నాయకులు వాగ్వాదానికి దిగారు. 2017 ఎన్నికల సమయంలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైడాఫీస్ లోపల ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఎవరూ అడ్డు చెప్పలేదని, తాజాగా సోమవారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయం లోపల ప్రతీ సెల్‌లో తిరిగి ఉద్యోగులను ఓట్లు అడిగినా మాట్లాడని అధికారులు.. తమ ఎమ్మెల్యే రాకుండా తలుపు మూయడం ఏంటని నిలదీశారు. ఈ క్రమంలో కూనంనేని కూడా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన సింగరేణి డైరెక్టర్(పా) ఎన్. బలరామ్, ఇతర జీఎంలు వచ్చి సిబ్బందిని మందలించడంతో పాటు ఎమ్మెల్యేకు సర్దిచెప్పడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

టీబీజీకేఎస్ ప్రచారం అడ్డగింత



టీబీజీకేఎస్ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఈనెల 27న సింగరేణి ఎన్నికలను పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం తెలంగాణ టీబీజీకేఎస్‌కు మద్దతుగా కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి ప్రచారం నిర్వహించబోయారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఇతర అధికారులు అక్కడికి చేరుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమం ఉన్నందున ఇక్కడ ప్రచారం చేయవద్దని, ఏదైనా ఉంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాత రావాలని చెప్పారు. హైదరాబాద్ ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ప్రకారం మంత్రి కార్యక్రమంపై కఠిన నిబంధనలు ఉన్నాయని, అందుకు సహకరించాలని కోరడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దూది రైతుకు దుఃఖం

పత్తి రైతుకు అందని మద్దతు ధర

- సీసీఐ నిబంధనలతో 'ప్రైవేటు'కు విక్రయాలు
- వర్షాలు, తెగుళ్లతో తగ్గిన పంట దిగుబడి
- ఇటీవల మిచాంగ్ తుపాన్‌తో రంగుమారిన పత్తి
- ఇదే అదునుగా తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు





పత్తి లోడ్ చేస్తున్న కార్మికులు (ఇన్‌సెట్) బోరెంలో పత్తి తొక్కుతున్న దృశ్యం

పాల్వంచరూరల్: ఆరుగాలం శ్రమించిన పత్తి రైతులు దగా పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు, చిల్లర కాంటా వ్యాపారులు తక్కువ ధరకే పంట కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు సీసీఐ కేంద్రాల్లో కొర్రీలు పెడుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయించుకోవాల్సి వస్తోంది. అనంతరం వ్యాపారులు సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తుండటం గమనార్హం. తగిన సంఖ్యలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, అధికారుల పర్యవేక్షణలోపం, నిబంధనల కారణంగా రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారు.

1.88 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది పత్తి పంట సాధారణ విస్తీర్ణానికి మించి సాగైంది. సుమారు 1.83 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అతివృష్టి కారణంగా దాదాపు పదివేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. ఇటీవల వచ్చిన తుపాన్‌కు చెట్టుమీద ఉన్న పత్తి తడిసి నల్లబడిపోయింది. జిల్లాలో ఈ ఏడాది 1.40 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనావేశారు. కొనుగోలుకు గత నెల నుంచి జిల్లాలో 4 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈసారి మద్దతు ధర కూడా పెంచింది. గతేడాది క్వింటాల్ రూ. 6,380 ఉండగా, రూ.640 పెంచి క్వింటాకు రూ.7,020గా మద్దతు ధర నిర్ణయించింది. గతేడాది అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో మద్దతు ధర కంటే అధికంగా రేటు లభించింది. కానీ ఈసారి రైతులు మద్దతు ధర కూడా పొందలేకపోతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు నాలుగే..

గత నెల 1 నుంచి పత్తి కొనుగోలుకు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా 4 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం, సింగరేణి మండల కేంద్రంలో, భద్రాచలం మండలంలో, సుజాతనగర్‌లో ఒక్కోటి చొప్పున.. మొత్తం 4 కేంద్రాల ద్వారా పత్తి కొంటున్నారు.

వర్షాలకు రంగుమారిన పత్తి

తేమశాతం 8 ఉంటే క్వింటా పత్తికి రూ.7,020, తేమశాతం 9 ఉంటే క్వింటాకు రూ.6050 చొప్పున ధర నిర్ణయించారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొంటున్నా నిబంధనలకు ఆందోళన చెందుతూ రైతులు పత్తిని తీసుకెళ్లడంలేదు. పత్తి తీత సమయంలో వచ్చిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో పత్తి పూర్తిగా తడిసి రంగు మారింది. తేమ శాతం కూడా పెరిగింది. దీంతో మద్దతు ధర లభించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుండటంతో సహజంగా పత్తిలో తేమశాతం పెరుగుతుందని పేర్కొంటున్నారు. తేమశాతం ఎక్కువ ఉండి, పత్తి రంగు మారితే సీసీఐ కేంద్రాల్లో కొనడంలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్మేస్తున్నామని రైతులు చెబుతున్నారు. పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు, చిల్లర కాంటా వ్యాపారులు రూ. 5 వేల నుంచి 6. వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. పత్తి అధిక సాగయ్యే పాల్వంచ, ఇల్లెందు, జూలూరుపాడు, కొత్తగూడెం వంటి మండలాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు చిల్లర కాంటా వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు.

1,83,578 ఎకరాలు	1,40,000 వేల మెట్రిక్ టన్నులు	రూ.7,020	రూ. 640	రూ. 5-6 వేలు
జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం	దిగుబడి అంచనా	క్వింటాకు మద్దతు ధర	గతేడాది కంటే పెరిగినది	ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో పెడుతున్న ధర

తగ్గిన పత్తి దిగుబడి



ఎన్నో ఆశలతో పత్తి పంటను సాగు చేస్తే వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిపోయింది. నేను 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తిపంట సాగుచేశాను. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ. 40 వేల పెట్టుబడి పెట్టాను. దిగుబడి మాత్రం ఎకరానికి 4 క్వింటాలే వచ్చింది. బాగా నష్టం జరిగింది.

–జైపాల్‌రెడ్డి, రైతు, రెడ్డిగూడెం

కేంద్రాలు అందుబాటులో ఏర్పాటు చేయాలి



జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు నాలుగు మాత్రమే ఏర్పాటు చేయడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం మండలానికో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. జిన్నింగ్ మిల్లుల ఏర్పాటు ప్రోత్సహించాలి. జిల్లా కేంద్రంలో కూడా కేంద్రం ఏర్పాటు చేయాలి.

–తెల్లం మల్లేష్, రైతు, దంతలబోరు

లైసెన్సు లేకుండా కొంటే చర్యలు



సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు నవంబర్‌లో కేంద్రాలను ప్రారంభించాం. ఈ ఏడాది 1.40లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశాం. ఈఏడాది ఇప్పటివరకు 14,900 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశాం. లైసెన్స్ లేకుండా చిల్లర కాంటాల ద్వారా పత్తిని కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటాం

–అలీం, జిల్లా మార్కెటింగ్‌శాఖ మేనేజర్

క్లుప్తంగా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన నంబూరి



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా కేంద్రప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరికీ అందించాలని కోరారు. అర్హులందరికీ ఆయుష్మాన్‌భారత్, పీఎం యోజన, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల అందేలా చూడాలని కోరగా.. ప్రభుత్వాధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కిషన్‌రెడ్డి సూచించారు.

జిల్లా సస్యశ్యామలమే ధ్యేయం

'క్రెడాయ్' ప్రాపర్టీ షోలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు, పక్కన క్రెడాయ్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయడమే తన జీవిత ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో సోమవారం ముగియగా, సమావేశంలోమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాతో పాటు ఖమ్మం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2008లో ప్రారంభించిన క్రెడాయ్ సంస్థ దిగ్విజయంగా కొనసాగుతుండడం అభినందనీయమని చెప్పారు. అనంతరం క్రెడాయ్ అధ్యక్షుడు బండి జయకిషోర్ ఆధ్వర్యాన మంత్రి తుమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి పెద్ది కేశవరావుతో పాటు చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, కొప్పు నరేష్, సాధు రమేష్‌రెడ్డి, వేములపల్లి నగేష్, ఉమేష్, హైటెక్ రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి.. గరం చాయ్ !



పాల్వంచ బస్టాండ్ సమీపంలో అర్ధరాత్రి టీ తాగుతున్న కూనంనేని

పాల్వంచ : అసలే చలికాలం అందులో అర్ధరాత్రి సమయం కావడంతో వేడివేడిగా ఉండేందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చాయ్ తాగాలనుకున్నారు. దీంతో పాల్వంచ బస్టాండ్ పక్కన జాతీయ రహదారిపై టీ బండి కనిపించగానే ఆగిపోయారు. ఆదివారం అర్ధరాత్రి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరుగుతుండగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయన పలు ప్రార్థనా మందిరాలకు వెళ్లారు. ఈ సమయంలో రోడ్డుపై ఆగి ఇతర నాయకులతో కలిసి గరం గరం టీ తాగారు. ఈ వీడియో సోమవారం వైరల్ అయింది.

ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు, జేసీబీ

దుమ్ముగూడెం : మండలంలోని రేగుబల్లి గ్రామంలో గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ దోమల రమేష్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ గణేష్ సిబ్బందితో వెళ్లి ఆదివారం రాత్రి దాడి చేశారని చెప్పారు. తదుపరి చర్యలకు తహసీల్దార్‌కు అప్పగిస్తామని వివరించారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లి వెంగళరావునగర్‌కు చెందిన కొల్లిపర సత్యనారాయణ(30) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యాన ఆయన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవటంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించిన ఆయన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అటు చలి.. ఇటు వ్యాధుల వ్యాప్తి

ఆస్పత్రుల్లో పెరుగుతున్న బాధితులు

- ఉష్ణోగ్రత పడిపోతుండడంతో అనారోగ్య సమస్యలు
- జ్వరం, జలుబు, దగ్గుతో ఎక్కువ మందికి ఇబ్బందులు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



సత్తుపల్లిలో సోమవారం ఉదయం మంచుదుప్పటి

ఖమ్మంవైద్యవిభాగం: కొద్దిరోజులుగా చలితీవ్రత పెరుగుతూ వస్తోంది. గత రెండు వారాలుగా చలితో ఉమ్మడి జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. చీకటి పడే సమయం నుండి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు చలి తీవ్రత ఉండడం.. దీనికి తోడు చల్లటి గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు నానాటికీ పడిపోతుండడంతో వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడే వారు సమస్య ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత వల్ల దగ్గు, జ్వరం, జలుబు, శ్వాస సంబంధిత వ్యాధులతో ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. సాధారణ చికిత్సల కంటే ప్రస్తుతం వీటి బాధితులే ఎక్కువగా ఆస్పత్రులకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మరోపక్క కరోనా కలకలం కూడా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

చలి తీవ్రరూపం దాల్చడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోతున్న తరుణంలో ప్రతీఒక్కరూ ఉన్ని దుస్తులు ధరించాలని, శ్వాస సంబంధిత వ్యాధులు, ఆస్తమాతో బాధపడుతే వారు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని చెబుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి వేధిస్తుంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అలాగే, గోరు వచ్చని నీరు మాత్రమే తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని, బయటకు వెళ్లినప్పుడు ఉన్ని దుస్తులు, మాస్క్‌లు, చెవులను కప్పి ఉంచేలా ఉన్ని టోపీలు ధరించాలని వెల్లడించారు. ఇక వృద్ధులు, చిన్నపిల్లలు రాత్రి సమయంలో బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిదని సూచించారు.



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ, ఐపీ వివరాలు

నెల	ఓపీ	ఐపీ
అక్టోబర్	48,094	10,514
నవంబర్	44,529	10,002
డిసెంబర్ (24 వరకు)	42,666	8,065

ఖమ్మం పెద్దాస్పత్రిలో పెరిగిన ఓపీ సేవలు

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ నెలలో ఓపీ సేవలు పెరిగాయి. చలి తీవ్రతతో జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత బాధితులు పెరగడంతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. జిల్లాలోని ఇతర ఆస్పత్రులతో పోలిస్తే పెద్దాస్పత్రికి వచ్చే వారి సంఖ్య ఎక్కువైంది. ఏటా చలికాలంలో సాధారణ రోగులు, గర్భిణీలు, చిన్నారుల ఓపీ వెయ్యి నుంచి 1,200 వరకు ఉంటుంది. కానీ ఈ నెల ప్రతీరోజు సగటున 1,700 వరకు ఓపీ నమోదవుతుండడం గమనార్హం. చలి తీవ్రత కారణంగానే ఇలా జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రిలోనే కాకుండా వివిధ పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మరో పది రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెబుతున్నారు.

చిన్నారుల విషయంలో అప్రమత్తత



చలితీవ్రత దృష్ట్యా చిన్న పిల్లల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చలిగాలుల్లో బయట ఆడకుండా చూడాలి. సూర్యరశ్మి ఉన్నప్పుడే వెళ్లనివ్వాలి. చేతులు తరచూ శుభ్రం చేయించాలి. వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలి. రద్దీ ప్రాంతాలకు చిన్నారులను తీసుకెళ్లకపోవడమే మంచిది. నీరు ఎక్కువగా తాగించాలి. అది కూడా గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగిసే మంచిది. దగ్గు, జ్వరం, జలుబు లక్షణాలు ఉంటే సొంత వైద్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ బాబురత్నాకర్, ప్రభుత్వ ఆస్పత్రి పీడియాట్రిక్ హెచ్‌ఓడీ

సొంత వైద్యంతో నష్టాలే...



ఈ కాలంలో సహజంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి తదితర సమస్యలు ఎదురవుతాయి. ఎట్టి పరిస్థితుల్లో సొంతంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, వృద్ధులు ఈ కాలంలో జాగ్రత్తగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు ఉన్ని దుస్తులు ధరించి ముక్కు, చెవుల్లోకి గాలి వెళ్లకుండా చూడాలి. గుండె సంబంధిత బాధితులు, మధుమేహ వ్యాధిస్తులు వైద్యుల సూచన మేరకు జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జనరల్ మెడిసిన్, జిల్లా ఆస్పత్రి

దాచినా దాగలేదు..

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రైవేట్ బ్యాంక్ పంచాయితీ
- నగదు స్వాహాపై తొలుత ఇద్దరు ఉద్యోగులపైనే అనుమానం
- ఇప్పుడు ముగ్గురు ఉద్యోగులు, ఓ ఉద్యోగి భార్యపై ఫిర్యాదు, కేసు నమోదు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.కోటిన్నర నగదు స్వాహా వ్యవహారాన్ని బ్యాంకు అధికారులు దాచిపెట్టాలని భావించి అది కాస్త బహిర్గతం కావటంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సత్తుపల్లిలోని ఏడు బ్యాంకుల్లో 2017లో నకిలీ పాస్‌పుస్తకాలు సమర్పించి రూ.కోట్లలో కుంభకోణం జరిగిన విషయం విదితమే. ఈ విషయం మరిచిపోకముందే మరో బ్యాంక్‌లో డిపాజిట్లు, చెక్కుల బదలాయింపు, ఓడీ, జనరల్ అకౌంట్లలో జమ కావాల్సిన డబ్బును కొందరు ఉద్యోగులు సొంతానికి వాడుకున్న ఘటన వెలుగు చూసింది. ఈ విషయమై 'సాక్షి'లో శనివారం 'రూ.కోటిన్నర హాంఫట్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. అయితే, అధికారులు కస్టమర్లను ఒప్పించి విషయం బయటకు రాకుండా నెల రోజులుగా ప్రయత్నాలు చేసినా ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనకు ఇద్దరు ఉద్యోగులే బాధ్యులని తొలుత వెల్లడించినా లోతైన విచారణలో మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులను ఆశ్రయించారు.

వినియోగదారుల్లో ఆందోళన

బ్యాంకులో జమ కావాల్సిన నగదును ఉద్యోగులు సొంతానికి వాడుకున్నట్లు తెలియడంతో ఖాతాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఖాతాదారులెవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అలాగే, అధికారులు కూడా ఇన్నాళ్ల అంతర్గత విచారణ చేస్తూ వినియోగదారులకు నష్టం జరగదని చెబుతూ వచ్చారు. అలాగే, కొందరికి లెటర్లు కూడా ఇచ్చారు. కానీ ఇంతలోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తారా, లేదా అన్న మీమాంస ఖాతాదారుల్లో వ్యక్తమవుతోంది. పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడం వల్ల డబ్బు చెల్లింపులు జరగవేమోనని ఆందోళన సందేహం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు తమ డిపాజిట్లు సురక్షితంగా ఉన్నాయా, లేదా అని బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

సత్తుపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ఓ రెస్టారెంట్ సమీపాన ఉన్న బ్యాంకు ఉద్యోగులు నలుగురిపై కేసు నమోదైంది. డిప్యూటీ మేనేజర్ ప్రశాంత్, అసిస్టెంట్ మేనేజర్‌గా సైదుల్‌రెడ్డి, ఆయన భార్య స్వప్న, ఉద్యోగి చెన్నారావుపై బ్యాంక్ మేనేజర్ నాగరాజు ఆదివారం రాత్రి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.1.50 కోట్ల మేర కస్టమర్ల నగదు వాడుకున్నారని ఫిర్యాదులో పేర్కొనగా, కేసు విచారణ ప్రారంభించినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- సొంతంగా రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు
- వెంకట్రామిరెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే రాగమయి



కామాక్షి ఆలయం వద్ద శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన) ముందుకు సాగుతుండడం అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. గంగారం గ్రామపంచాయతీలో ఆయన సొంత నిధులు రూ.కోటితో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే, తదితరులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకట్రాంరెడ్డి 13 చర్చిలకు 1,100 స్వీట్ బాక్సులు అందించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే, రూ.8 లక్షల వ్యయంతో జలగంనగర్‌లో రెండు బోర్లు, వడ్లబజారులో ఒక బోరు వేయిస్తుండగా, రూ.50 లక్షల నిధులతో ఫంక్షన్ హాల్, రూ.10 లక్షలతో చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్, కామాక్షి ఆలయానికి ప్రహరీ, రెండు చర్చిలకు షెడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి మధుమోహన్‌రెడ్డి, కరాటే రమేష్, యామాల ముత్యాలరావు, మాజీ సర్పంచ్ కోటమర్తి రమేష్, శ్రీరామ వెంకటేశ్వరరావు, కోటగట్ల చెన్నకేశవరావు, యామాల మల్లేశ్వరరావు, బత్తుల నారాయణ, నాగేశ్వరరావు, కర్నాటి వెంకట్రావు, చిన్నబాబు పాల్గొన్నారు.

కారేపల్లిలో కత్తులతో దాడి

- పేగులు బయటకు వచ్చి ఒకరికి తీవ్రగాయాలు
- పీఎస్‌లో ఫిర్యాదు చేసి వస్తున్న సమయాన ఘర్షణ



కత్తిపోట్లకు గురైన హేమ్లా నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి

కారేపల్లి: కత్తులతో దాడి చేయగా ఇద్దరికి తీవ్రంగా గాయపడిన ఘటన కారేపల్లి పోలీసుస్టేషన్ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరుపల్లికి చెందిన కేలోతు శ్రీను, పోలంపల్లికి చెందిన బోడ అశోక్‌కు మధ్య కొంత కాలంగా కుటుంబ తగాదాలు నడుస్తున్నాయి. ఈక్రమాన సోమవారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా ఇరుపక్షాలకు మరోసారి వివాదం జరిగింది. దీంతో రెండు వర్గాల వారు సోమవారం రాత్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి బయటకు వస్తున్నారు. ఇంతలోనే కేలోతు శ్రీను సోదరుడైన కేలోతు హేమ్లా, ఆయన వద్ద పనిచేసే బుగ్గ సతీష్‌పై పోలీసు స్టేషన్ సమీపాన అశోక్‌తో పాటు మరో వ్యక్తి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. హేమ్లా పొట్ట, తలభాగంలో కత్తిపోట్లు పడగా పేగులు బయటకు వచ్చాయి. అలాగే,సతీష్ కాలితొడ భాగంలో రక్తస్రావమైంది. దీన్ని గమనించిన స్థానికులు బస్టాండ్ వైపు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఘటనా సమాచారం అందుకున్న కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ పుష్పాల రామారావు చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పెద్దసంఖ్యలో జనాలు గుమికూడడంతో చెదరగొట్టిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎదుగుదల ఓర్వలేకే సస్పెన్షన్

అశ్వాపురం: తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే టీఎస్‌టీయూసీ నుంచి సస్పెండ్ చేశారని, ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించారని భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడు రాయల రాజేష్ అన్నారు. సోమవారం గౌతమీనగర్ కాలనీలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయకుండా స్వార్థ నాయకులు కుట్ర పన్నారని, అయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించానని చెప్పారు. తన సస్పెన్షన్ విషయాన్ని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

డీఆర్‌జీ జవాన్‌ను హతమార్చిన కేసు


చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం ఉదయం డీఆర్‌జీ జవాన్‌ను హతమార్చిన ఘటనలో ఇద్దరు మావోయిస్టులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేసి లొంగిపోయిన అనంతరం జీవనోపాధి కోసం అక్కడి పోలీసుశాఖ చోటు కుర్సంకు డీఆర్‌జీ జవాన్‌గా పోస్టింగ్ ఇచ్చింది. ఈ క్రమంలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన ఆయన.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మావోయిస్టులు అడ్డుకుని కుర్సంను హతమార్చారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బీజాపూర్ జిల్లా పోలీసులు సోమవారం ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేశారు. వీరిలో బీజాపూర్ జిల్లా కోత్రా పోలీస్‌స్టేషన్ పరిధి కోక్కాకు చెందిన గుడ్డు కుర్సంతో పాటు మరో మైనర్ ఉన్నాడని పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణం సమీపంలో వివాదం

సుజాతనగర్: మండల కేంద్రంలోని ఓ మద్యం దుకాణం సమీపంలో సోమవారం రాత్రి వివాదం చోటుచేసుకుంది. దుకాణం పక్కనే ఉన్న ఓ ఇంటి ఎదురుగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవిస్తుండగా ఇంటి యజమాని 'ఇక్కడ తాగొద్దని' వారికి చెప్పింది. దీంతో ఆగ్రహించిన మద్యం ప్రియులు సదరు మహిళపై వాగ్వాదానికి దిగడంతో ఆమె భర్త వచ్చి వారిని అడ్డుకోబోయాడు. ఈ క్రమంలో వారు మహిళ భర్తపై దాడికి దిగగా.. ఆమె అడ్డు రావడంతో ఆమె చేతికి గాయమైంది. స్థానికుల హెచ్చరికలతో మద్యం ప్రియులు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

బొలెరో కిందపడి ఆర్టిజన్ మృతి

పాల్వంచలో విషాదం



లింగయ్య(ఫైల్)

పాల్వంచ : ధాన్యం పట్టించేందుకు రైస్ మిల్లు వద్దకు వెళ్లి బొలెరో వాహనం కిందపడి కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సోమవారం పాల్వంచలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన దూదిమెట్ల లింగయ్య(55) కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. తన పొలంలో పండించిన వడ్లను బియ్యం పట్టించేందుకు స్థానిక అల్లూరి సెంటర్‌లోని రైస్‌మిల్లుకు బొలెరో వాహనంలో తీసుకొచ్చాడు. తన ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి వస్తుండగా బొలెరో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని వెనక్కి తీస్తున్న క్రమంలో టైర్ కింద పడగా, వాహనం తలపై నుంచి వెళ్లింది. దీంతో తల భాగం నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఈ ఘటనతో పాల్వంచలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదతీరును పరిశీలించారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమార్తె రేవతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ సోమ రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.బి.రాము తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోతు విజయ్(33) వ్యవసాయ పనులతో పాటు ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారం క్రితం ఇంట్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా కుటుంబసభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కొత్తగూడేనికి, ఆ తర్వాత ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విజయ్‌కి భార్య లలిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

పురుగుమందు తాగి రైతు...

గుండాల: మద్యం తాగొద్దని మందలించినందుకు మనస్తాపంతో పురుగుమందు తాగి ఓ రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సనప నర్సింహారావు (42) భార్యతో కలిసి ఆదివారం చేను పనికి వెళ్లాడు. ఈ క్రమంలో ఎప్పుడూ మద్యం తాగి ఉంటున్నావని, చేను పనులు సరిగ్గా చేయడం లేదని భార్య మందలించింది. దీంతో సాయంత్రం వేళ పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున నర్సింహారావు మృతి చెందాడు. మృతుడికి భార్య రామక్క, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాల్వంచ : వేగంగా వెనుక నుంచి ఓ కారు మరో కారును ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని జగన్నాథపురం జాతీయ రహదారిపై సోమవారం భద్రాచలం వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. దీంతో గాయపడిన ఇద్దరిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెనుక నుంచి ఢీ కొట్టిన కారులో మల్లూరు ఎంపీఓ ఉన్నట్లు సమాచారం.

లారీని ఢీ కొట్టిన బైక్


ఒకరికి తీవ్ర గాయాలు

దమ్మపేట : రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని ముష్టిబండ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రంగువారిగూడెం గ్రామానికి చెందిన కనుమూరి సత్యం (55) ద్విచక్ర వాహనంపై ముష్టిబండ నుంచి రంగువారిగూడెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముష్టిబండ గ్రామ శివారులోని గాంధీనగరం గ్రామ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యం తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పందెం రాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని తొట్టిపంపు గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కోడి పందెం ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై రవికుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి శిబిరంపై దాడి చేశారు. రెండు కోడి పుంజులు, మూడు బైక్‌లు, రూ.3000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కామెర్లతో వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

వైరా: కొంతకాలంగా అనారోగ్యానికి గురై కామెర్ల బారిన పడిన వ్యక్తి మృతి చెందాడు. వైరా మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన చిలకా రమేష్(29) పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చేయికోల్పోయాడు. ఆతర్వాత కాలంగా అనారోగ్యానికి గురై కామెర్ల వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధిర: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని ఇల్లెందులపాడు గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఇల్లెందులపాడుకు చెందిన తాళ్లూరి రామారావు(55) మధిర– దెందుకూరు ప్రధాన రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మధిర నుంచి దెందుకూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఇల్లెందులపాడు వద్ద ఢీకొట్టడంతో రామారావుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు మధిర టౌన్ ఎస్‌ఐ రాజేష్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc (Agri), B.Sc (Nursing), B.Ed, MBA, MCA Eligible for all Govt Jobs & Further Studies. Ph: 8866977112,339. [HA-14940]

Services

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు, సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-223]

Wanted

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజీలు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ Wanted Marketing Executives for Solar Energy Products Dr. MAK Engineering and Services Private Limited, Sambhani Nagar, Khammam.-63047 46627 [M-1167572]

■ SHARA సంస్థలో పని చేయుటకు యువకులు కావలెను. Q: 10th, Inter, Degree, ITI, Diploma (P/F). శిక్షణలో 9,500 + ఫ్రీరూం, శిక్షణ తర్వాత 22,000/- + బైక్. సంప్ర: 9063107258. [WA-7260]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

క్లుప్తంగా...

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అంశాలపై పాలకమండలి చర్చించనుంది.

సర్వదర్శన టోకెన్ల జారీ పూర్తి:
ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన సర్వ దర్శన టోకెన్ల జారీని సోమవారం టీటీడీ పూర్తి చేసింది. తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్ పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 90 కౌంటర్లలో 10 రోజులకు గాను నాలుగు లక్షలకుపైగా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను భక్తులకు అందించారు. తదుపరి సర్వదర్శనం టోకెన్లను జనవరి 2వ తేదీ నుంచి ఇవ్వనున్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు
తిరుమలలో మంగళవారం నిర్వహించాల్సిన పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా మంగళవారం పౌర్ణమి గరుడసేవ రద్దు చేసింది.

పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్‌చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ● ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు



వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్‌ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ



సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న వైఎస్ విజయమ్మ

పులివెందుల: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లాలో మూడ్రోజుల పర్యటనలో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం ముఖ్యమంత్రి ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి హెలికాప్టర్ ద్వారా భాకరాపురం హెలిప్యాడ్, అక్కడ నుంచి రోడ్డు మార్గంద్వారా పులివెందుల పట్టణానికి చేరుకున్నారు. ఉ.9.30 గంటలకు సీఎస్‌ఐ చర్చి ప్రాంగణానికి చేరుకుని అక్కడ హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్.. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ రోజున తన సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు తనకు ఎల్లవేళ లా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తరిస్తున్నానని.. ఎప్పటికీ మీ హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా సుస్థిర స్థానాన్ని పొందుతానన్నారు. అనంతరం సీఎం జగన్ తన కుటుంబసభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. 2024 నూతన సంవత్సర చర్చి కేలండర్‌ను ఆవిష్కరించారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుటుంబసభ్యులు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆత్మీయులు, మిత్రులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలి

సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టులకు నోటిఫికేషన్

- 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీ దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్టు విధానంలో భర్తీకి దేవదాయ శాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నియామక ప్రక్రియ మొత్తాన్ని ప్రభుత్వం ప్రముఖ సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. ఏఈఈ పోస్టులకు సంబంధిత కేటగిరిలో బీఈ, బీటెక్ ఉత్తర్ణీత సాధించి ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమా పాసైన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కేటగిరి రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు రాత పరీక్ష ద్వారా ఈ పోస్టులు భర్తీ చేస్తారు. రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. 80 మార్కులకు సంబంధిత ఇంజనీరింగ్ అంశాలపైన, పది మార్కులకు ఇంగ్లిష్ ప్రావీణ్యం, మరో పది మార్కులకు జనరల్ నాలెడ్జితో కూడిన మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయని దేవదాయ శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

లోడింగ్‌లో దుమ్మురేపిన విశాఖ పోర్టు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ లోడింగ్‌లో దుమ్మురేపింది. రెండు రోజుల క్రితం నెలకొల్పిన రికార్డును అధిగమించింది. సోమవారం ఒక్క రోజులోనే ఎంవీ ఫెయిత్ నౌకలోకి 8,379 మెట్రిక్ టన్నుల కాల్సిన్డ్ అల్యూమినాను లోడింగ్ చేసింది. ఈనెల 23వ తేదీన 8,055 మెట్రిక్ టన్నుల లోడింగ్ రికార్డును బ్రేక్ చేసింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ స్టీవ్‌డోర్‌గాను, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసెస్ స్టీమర్ ఏజెంట్‌గా వ్యవహరించాయి.



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, జస్టిస్ సురేష్‌రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ హేమలేఖ సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి తిరుచానూరుకు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో శ్రీవారిని 63,519 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో రూ.5.05 కోట్ల కానుకలు సమర్పించారు.

2024లో ఇస్రో ప్రయోగాల పరంపర

జనవరి 1 నుంచే ప్రారంభం.. 2023లో 51 ఉపగ్రహాలు నింగిలోకి

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కొత్త ఏడాది ఆరంభంతోనే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగాల పరంపర ప్రారంభం కానుంది. 2024 జనవరి 1న ఉదయం 7.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ58 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా 480 కిలోల బరువు కలిగిన ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. దీంతో పాటు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన ఒక కేజీ బరువు కలిగిన వియ్‌శాట్ అనే బుల్లి ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నారు. భూమికి అత్యంత తక్కువ దూరంలోని లియో ఆర్బిట్‌లోకి ఈ రెండు ఉపగ్రహాలను పంపేందుకు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగం తరువాత చంద్రయాన్-4, గగన్‌యాన్-1 ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఇవి కాకుండా 2024లో 12 ప్రయోగాలకు తగ్గకుండా చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2023లో ఇస్రో అత్యధికంగా 8 రాకెట్ ప్రయోగాలు చేపట్టి 51 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. పీఎస్‌ఎల్‌వీ రాకెట్ల సిరీస్‌లో మూడు రాకెట్ల ద్వారా పది ఉపగ్రహాలు, ఎస్ఎస్‌ఎల్‌వీ డీ2 రాకెట్ ద్వారా మూడు ఉపగ్రహాలు, జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 రాకెట్ ద్వారా ఒక ఉపగ్రహం, ఎల్‌వీఎం 3 సిరీస్‌లో మూడు రాకెట్ ప్రయోగాల ద్వారా 37 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇవి కాకుండా గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఆర్ఎల్‌వీటీడీని ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించారు. 2023 ఇస్రోకి చరిత్రలో నిలిచిపోయిన సంవత్సరంగా చెప్పవచ్చును. ఎందుకంటే ఈ ఏడాది ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుడి దక్షిణధృవంపై ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా దించి చరిత్రలో మరువలేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అదే విధంగా సూర్యుడిపై పరిశోధనలకు గాను ఆదిత్య ఎల్1 అనే ఉపగ్రహాన్ని పంపించగా అది విజయవంతంగా పనిచేస్తోంది. ఆదిత్య ఎల్1 ఉపగ్రహం 2024 జనవరి 5న లాంగ్రేజియన్ పాయింట్ 1 వద్దకు చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.



పీఎస్‌ఎల్‌వీ సీ58 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం...

జిల్లా వార్తలు

తెలుగు మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్లను రాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 5, 6, 7వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రిలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యాన రెండో ప్రపంచ తెలుగు హాసభలు జరగనున్నాయి. ఈ సభకు రావాలని నిర్వాహకులు మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహాసభల తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, సాహితీవేత్తలు నామవరపు కాంతేశ్వరరావు, రెంటాల చినహుస్సేన్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, రేళ్ల శ్రీను, నల్ల కృష్ణ, గుమ్మడి పుల్లయ్య మలిశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ జిల్లాలో మందుపాతర గుర్తింపు, నిర్వీర్యం



పోలీసులు నిర్వీర్యం చేసిన మందుపాతర

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఏర్పాటు చేసిన శక్తివంతమైన మందుపాతరను ఆదివారం నిర్వీర్యం చేశారు. బీజాపూర్ జిల్లాలోని పల్నార్-చెర్పాల్ మార్గంలో రాకపోకలు సాగించే పోలీసు బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో ప్రధాన రహదారిపై మావోయిస్టులు సుమారు ఐదు కిలోల సామర్థ్యం కలిగిన మందుపాతరను ఏర్పాటు చేశారు. అయితే, రోడ్డును తనిఖీ చేస్తున్న రోడ్ ఓపెనింగ్ పార్టీ దీనిని గుర్తించగా, బాంబు డిస్పోజల్ టీం చేరుకుని దానిని నిర్వీర్యం చేశారు. దీంతో బలగాలకు ముప్పు తప్పినట్లయింది. ఈ మార్గంలో మరిన్ని మందపాతరలు ఉండొచ్చనే అనుమానంతో తనిఖీలు ముమ్మరం చేశారు.

'భద్రగిరి'లో భక్తుల రద్దీ

- పాపికొండల విహార యాత్రకూ అదే జోష్
- వరుస సెలవులతో భక్తుల బారులు
- వసతి సౌకర్యం కరువై తిప్పలు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వేంచేసియున్న భద్రాచలం 'భక్తాద్రి'గా మారింది. వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభమైన రద్దీ వరుస సెలవు రోజులతో అదేరీతిగా కొనసాగుతోంది. వైకుంఠ ఏకాదశికి తోడు ఆదివారం, సోమవారం క్రిస్మస్ వరుస సెలవులు రావడంతో భక్తులు, పర్యాటకులు భద్రగిరి బాట పట్టారు. దీంతో రెండు రోజులుగా వసతి లభించటమే గగనంగా మారింది. దేవస్థానం వసతి గృహాలు, సత్రాలు, కాటేజీలు ఎక్కడ చూసినా 'గదులు ఖాళీ లేవు' అనే బోర్డులే కనిపించాయి. దీంతో ప్రైవేట్ లాడ్జీ యాజమాన్యాలు ఒక గదికి రూ.3వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేశారు. ఫలితంగా కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు, పర్యాటకులు ఇబ్బంది పడ్డారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆలయం చుట్టు పక్కల దుకాణాలు ఎక్కడ చూసినా రద్దీగా కనిపించాయి. స్వామి దర్శనం అనంతరం పాపికొండల పర్యటనకు వెళ్లే పర్యాటకులకు సైతం టికెట్లు లభించలేదు. పాపికొండల టికెట్లకు ఈనెల 31 వరకు రద్దీ కొనసాగే అవకాశముందని లాంచీల యజమానులు చెబుతున్నారు.

రోజుకు 20 వేల మందికి పైగానే..
దేవస్థానంలో స్వామి వారిని రోజుకు 20 వేలకు మంది పైగానే భక్తులు దర్శనం చేసుకుంటున్నారని ఆలయ వర్గాలు తెలుపుతున్నాయి. వైకుంఠ ఏకాదశి రోజున సుమారు 30 వేలు, ఆది, సోమ వారాల్లో సుమారు 20 వేల మంది చొప్పున భక్తులు వచ్చి ఉంటారని అంచనా. కాగా దేవస్థానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ రమాదేవి స్వయంగా పర్యవేక్షించారు. భక్తులకు తాగునీరు, ప్రసాదం అందుబాటులో ఉంచారు. అన్నదానం టోకెట్లను సైతం పెంచారు. స్వామివారి ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటుండగా.. సోమవారం బేడా మండపంలో జరిగిన నిత్య కల్యాణంలో 162 జంటలు పాల్గొనడం విశేషం.



నిత్యకల్యాణానికి భారీగా హాజరైన భక్తులు

ముత్తంగి అలంకరణలో రామయ్య
అంతరాలయంలోని మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామి వారిని ముత్తంగి రూపంలో అలంకరించడం ఇక్కడ ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణం కోసం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ధాన్యం కొనుగోళ్లలో 'ప్రైవేట్' గోల్‌మాల్

- ధర పడిపోయిందంటూ పుకార్లు
- క్వింటాకు రూ.300–రూ.400 తగ్గిస్తున్న వైనం

కామేపల్లి: అన్నదాతలు విత్తనాల కొనుగోలు మొదలు పంట విక్రయించే వరకు మోసపోతూనే ఉన్నారు. వ్యాపారుల మాయాజాలంలో రైతులు రెక్కల కష్టంతో పండించుకున్న పంటను సరైన ధరకు అమ్ముకోలేక నష్టాలే మూటగట్టుకుంటున్నారు. ధాన్యం ధర పడిపోయిందని.. కొనుగోలు చేసే వారెవరూ లేరని నమ్మబలుకుతున్న ప్రైవేట్ కొనుగోలుదారులు అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పండితాపురం, ముచ్చర్ల, కామేపల్లి, లింగాల, తాళ్లగూడెం గ్రామాల్లో వరి ధాన్యాన్ని పలువురు ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పాటించాల్సి ఉండడంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా నాలుగు రోజుల క్రితం వరకు పచ్చి ధాన్యాన్ని క్వింటా రూ.2,300 నుంచి రూ.2,400 మధ్య కొనుగోలు చేశారు. ఇంతలోనే వ్యాపారులంతా ఒక్కటై ధాన్యం ధర తగ్గిందని, తాము కొనుగోలు చేయడం లేదని ప్రచారం చేశారు. ఇంతలోనే కొందరు రంగంలోకి దిగి క్వింటా రూ.1,900 చొప్పున అయితే కొనుగోలు చేస్తామని చెప్పడంతో యాసంగి పంటలకు నగదు అవసరమున్న రైతులు అదే ధరకు విక్రయించారు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలు అన్నట్లుగా సాగుతుండగా.. అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పండితాపురంలోలోని ఓ రైతు ఆరబోసిన ధాన్యం

ఉత్కంఠగా బాలికల క్రికెట్ టోర్నీ

- సెమీస్‌కు చేరిన ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు
- నేడు ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీ ఉత్కంఠగా సాగుతోంది. లీగ్ మ్యాచ్‌లు సోమవారం ముగియగా ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు సెమీస్‌కు చేరాయి. మంగళవారం సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి విజేతను ప్రకటించనున్నారు. పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి స్టెల్లా ప్రేమ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అనిల్‌కుమార్, వీరన్న, ఆదివానారాయణ, శ్రీనివాస్, నరేష్, వేణుగోపాల్ పర్యవేక్షిస్తున్నారు.

హోరాహోరీగా పోటీలు
ఉత్కంఠగా సాగిన లీగ్ మ్యాచ్‌ల్లో ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు లీగ్ విజేతలుగా నిలిచి సెమీ ఫైనల్‌కు చేరాయి. ఖమ్మం-కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 203 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఖమ్మం జట్టులో అనన్య 51 పరుగులు, వైష్ణవి రత్న 50(నాటౌట్) పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 15 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 157 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్-మెదక్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 92 పరుగులు చేసింది. ఈ జట్టులో అత్యధికంగా ఇందు 38 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు నిర్ణీత ఓవర్లలో 70 పరుగులే చేయగా ఓటమి పాలైంది. మూడో మ్యాచ్‌లో రంగారెడ్డి-నల్లగొండ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జట్టు 12 ఓవర్లలో 74 పరుగులు చేసింది. జట్టులో ధృతి 27 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నల్లగొండ జట్టు నిర్ణీత ఓవర్లలో 31 పరుగులే రంగారెడ్డి జట్టు గెలిచినట్లు ప్రకటించారు. ఇక నాలుగో మ్యాచ్ మహబూబ్‌నగర్-ఆదిలాబాద్ జట్ల మధ్య జరగగా మహబూబ్‌నగర్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 15 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేయగా ఓటమి పాలైంది.

రాణిస్తున్న ఖమ్మం క్రీడాకారులు
రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ టోర్నీలో మొదటి నుంచి ఖమ్మం జట్టు ఉత్తమంగా రాణిస్తోంది. భద్రాచలానికి చెందిన అనన్య, మణుగూరుకు చెందిన వైష్ణవిరత్న ఈ జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కరీంనగర్ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అనన్య 51 పరుగులు చేయగా వైష్ణవిరత్న 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును సెమీస్‌కు చేర్చారు. తొలిరోజు హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అనన్య 50 పరుగులు చేయడం విశేషం.



ఖమ్మం-కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్



51 పరుగులు చేసిన అనన్య (ఖమ్మం)



50పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన వైష్ణవిరత్న (ఖమ్మం)

సింగరేణి ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన

మణుగూరు రూరల్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం జరగనుండగా, సాయంత్రం ఓట్లు లెక్కించనున్నారు. ఈ మేరకు మణుగూరు ఏరియాలోని పీ.వీ.కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం మణుగూరు డీఎస్పీ సందర్శించి పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించి భద్రత ఏర్పాట్లపై పోలీస్, సింగరేణి అధికారులతో చర్చించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల నిర్వహణ అధికారుల నుండి సంఘాల నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు తప్పకుండా పాస్‌లు తీసుకోవాలని, పాస్‌ల ఉన్న వారినే కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. అలాగే, సెల్ ఫోన్లను తీసుకు రావొద్దని సూచించారు. కాగా, ఎన్నికల నేపథ్యాన బుధవారం మణుగూరు ఏరియాలో 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ రమాకాంత్, అశ్వాపురం సీఐ రవీందర్, ఏడూళ్ల బయ్యారం సీఐ శివప్రసాద్, పోలీస్ సిబ్బంది, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



కేంద్రంలో పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘువేంద్రరావు, అధికారులు